విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 127 | ఆదివారం 06. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


# కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి..

- బీఆర్ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దె దిగిపోయింది
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారి చరిత్రను ప్రజలు గమనించాలి
- నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- "బీఆర్ఎస్ నేతలు తెలంగాణను బందిపోటుల్లా దోచుకున్నారు.
- ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అనేక రకాలుగా మోసపోయారు.
- విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నాం
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను పూర్తి చేశాం
- టీచర్ల బదిలీల విషయంలోనూ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం
- కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం
- తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులే..
- 'రాష్ట్రంలో 88 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు.
- నేనూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాను.
- పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదు.
- విద్యాశాఖ కమిషన్ ద్వారా చాలా సమస్యలు పరిష్కరిస్తున్నాం.
- హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది
- టీసీఎస్ హైపర్‌వాల్ట్, తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం
- 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో డేటా సెంటర్ ఏర్పాటు

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నకిరేకల్‌లో నిర్వహించిన '1000 రోజుల ప్రజా పాలన ప్రగతి సభ'లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ పాలనపై, ఆ పార్టీ నాయకుల వ్యాఖ్యలపై హాట్ కామెంట్స్ చేశారు. తనకు చదువు రాదంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ.. నాకు చదువు ఉందో లేదో తెలియదు కానీ, సమాజంలో ఎలా ఉండాలో సంస్కారం ఉందంటూ" మండిపడ్డారు. "నీ చదువు ఏంటో, నా చదువు ఏంటో శాసనసభ వేదికగానే తేల్చుకుందాం. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు ఇంకా రోడ్లపై స్వేచ్ఛగా తిరుగుతున్నారు" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నది కేటీఆర్ కుటుంబమేనని ఆరోపించారు. సొంత చెల్లెలు రాఖీ కట్టేందుకు వస్తే ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని మెడపట్టి గెంటిన గాడిదవు నువ్వు అంటూ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు సంస్కారం ఉంది కాబట్టే ప్రజాప్రతినిధులైన కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నానని సీఎం స్పష్టం చేశారు. జైపాల్ రెడ్డి, జానారెడ్డి లాంటి పెద్దలు వదిలేయడం వల్లే వీరు ఇలా తయారయ్యారని, ప్రస్తుతం ప్రజాపాలన పోయి మళ్లీ పాపాల భైరవుడు రావాలని దీక్షలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బీఆర్ఎస్ అమలు చేసిన ఏ పథకాన్ని రద్దు చేయలేదని సీఎం స్పష్టం చేశారు. ఈ నెలాఖరులో సిరిసిల్లకు పోదామని, కదం తొక్కుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల, సిద్ధిపేటలను కూడా గెలుచుకుంటామని, సిరిసిల్ల తర్వాత సిద్ధిపేటపై దండయాత్ర చేస్తామని ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 నెలల్లోనే రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. దీనిపై శాసనసభలో సమగ్రంగా చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, తండ్రి- కొడుకు, మామా - అల్లుడు ఎవరొచ్చినా చర్చకు రెడీ అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనను, తమ కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ కాంగ్రెస్ దే అధికారమని సీఎం రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రజలు విజయరథం పడతారన్నారు.





## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి

- కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు
- తెలంగాణ తెచ్చిన ఆయన రాజీనామా చేయాలా?
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- కరీంనగర్‌లోని డా.బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరీ
- ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలో ఉన్నాయి.
- "నిరుద్యోగులను కాంగ్రెస్ నిండా ముంచింది.
- ఈ ప్రభుత్వ పాలనలో విజన్ కాకుండా విధ్వంసమే ఉంది.
- ఉద్యోగాలు అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారు.
- నోటిఫికేషన్ గురించి అడిగితే లూటిఫికేషన్ చేస్తున్నారు"



**హైదరాబాద్ తెలంగాణ వాణి)**
యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చారు.. ఒక్కటంటే ఒక్కటి అమలు కూడా చేయలేదని అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 100 రోజుల్లో అన్నీ అమలు చేస్తామని డైలాగులు కొట్టారు.. 1000 రోజులు అయిపోయింది.. 100 రోజులకు 10 రెట్లయింది.. ఏం చేసినవయా..? చెప్పు అంటే ఏమీ లేదన్నారు. బకాసురుల్లాగా మేస్తున్నరు.. కుంభకర్ణుల్లాగా పంటున్నరు.. పందికొక్కుల్లాగా తింటున్నరు... అది తప్ప ఏదీ లేదు చేసింది.. ఇక మీదికెళ్లి.. తిన్నది అరగక కేసీఆర్ రాజీనామా చేయాలని తీట మాటలు మాట్లాడుతున్నారు.. ఎవరు చేయాలే.. ఎందుకు చేయలే రాజీనామా..? అని నేను అడుగుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాల్నా.. మీరు చెప్పాలే.. ఎవరు చేయాలే రాజీనామా.. అని కేటీఆర్ అడిగితే.. విద్యార్థులంతా ముక్తకంఠంతో రేవంత్ రెడ్డి అంటూ సమాధానమిచ్చారు. 100 రోజులు అని చెప్పి 1000 రోజులు మోసం చేసిన ధోకేబాజ్ (మోసగాడు)రాజీనామా చేయాల్నా లేదా.. అని అడిగారు. నిరుద్యోగులను నిండా ముంచిన లఫంగా పార్టీ కాంగ్రెస్ ఇయ్యాళ్ల పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతోందన్నారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కేటీఆర్ ఫైర్ అయ్యారు. పేద ప్రజల భూములతో ఇవాళ కాంగ్రెస్ పార్టీ చెలగాట మాడుతోంది.



## నిమ్స్‌లో ఉద్యోగులకు 'ఉచిత ఓపీ' కొనసాగింపు

- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వైద్య సేవల్లో ప్రభుత్వం ఉపశమనం
- ఎంప్లాయీస్ హెల్త్ స్కీం(ఈహెచ్ఎస్) కింద నిమ్స్‌లో అవుట్ పేషెంట్ సేవలను ఉచితం
- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం
- లబ్ధిదారులకు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ సేవలు,
- కేవలం వెల్‌నెస్ సెంటర్లలో మాత్రమే ఓపీ సేవలను అందించాల్సి ఉంది.
- మరోవైపు రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్లు సేవలందిస్తుండగా,
- తాజాగా మరో 24 కొత్త సెంటర్లను మంజూరు

## రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ క్షీణించిపోయింది

- భూభారతి, 22ఏ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి,
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- ఇందిరాపార్క్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా ధర్నా
- 'తెలంగాణలోని లక్షలాది ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు.
- పేద, మధ్యతరగతి ప్రజల భూములను చేర్చడంతో వారు అల్లాడిపోతున్నారు.
- నిషేధిత జాబితాలో నుంచి భూమి తీసేయాలంటే 30 శాతం కమీషన్ అడుగుతున్నారు.
- రెవెన్యూ వ్యవస్థ మొత్తం క్షీణించిపోయింది. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.
- కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూదొందే. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం దోచుకుంది.



## సిఎంఆర్ బియ్యం అక్రమార్కుల స్థిరాస్తుల జప్తు

- 13,399 కోట్ల అవినీతి సొమ్ము నుండి సగం సొత్తు రికవరీ
- వివిధ రంగాలలో పెట్టుబడి సొత్తు తిరిగి రాక
- పత్తా లేకుండా పారిపోయిన పదుల సంఖ్యలో మిల్లుల స్మగ్లర్లు

**హైదరాబాద్ సెప్టెంబర్ 5**

**(తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టి.ఎన్ రమేష్)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ అక్రమాలకు పాల్పడిన పలువురు రైస్ మిల్లుల యజమానుల నుండి వరి ధాన్యం, ప్రాసెస్ చేసిన రైస్, డబ్బు రూపంలో, సగం వరకు విజయవంతంగా రికవరీలు వచ్చేసింది. అప్పనంగా వచ్చిన డబ్బుతో అక్రమ మార్గంలో కొందరు బడా వ్యాపారులు, వివిధ రంగాలలో, పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టి సమయానికి డబ్బు రాకపోవడంతో, అక్రమ మిల్లర్లు కొందరు, పత్తా లేకుండా పరారైనట్లు సమాచారం. (పిడిఎస్) (సీఎంఆర్) లలో అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ ఖజానాకు వేలాది కోట్ల రూపాయలు గండి కొట్టిన, రైస్ మిల్లుల యజమానుల ను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించింది. బకాయిలు చెల్లించని యెడల, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ (వీ అండ్ ఈ) మరియు ఏసీబీ, టాస్క్ ఫోర్స్ అధికారులను ఉపయోగించి, రెవెన్యూ రికవరీ చట్టం జీవో ఎంఎస్ 7తో భౌతిక స్థిరాస్తులు జప్తు చేసి వేలం వేస్తామని ప్రభుత్వం తేల్చి చెప్పింది. డబ్బు కట్టలేని స్మగ్లర్లను జైలుకు పంపుతామని అధికారులు హెచ్చరించారు. దీంతో అక్రమంగా వరి ధాన్యం, ప్రాసెసింగ్ రైస్ స్మగ్లింగ్ కు పాల్పడిన కొందరు మిల్లుల యజమానులు, టీవీ ఇండస్ట్రీ, సినిమా ఇండస్ట్రీ, రియల్ ఎస్టేట్ వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టి, ఆ డబ్బు అంత త్వరగా తిరిగి రాదని తెలిసి, పత్తా లేకుండా పారిపోయినట్లు సమాచారం. కస్టమ్ మిల్ట్ రైస్ (సీఎంఆర్) కుంభకోణంపై జరుగుతున్న విస్తృత దర్యాప్తులో భాగంగా ప్రస్తుత



రికవరీ మరియు పెండింగ్ బ్యాలెన్స్ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అక్రమ రవాణా జరిగిన మొత్తం బియ్యం పరిమాణం టన్నులలో 59.96 లక్షల మెట్రిక్ టన్నులు.

**అక్రమార్కులు కొల్లగొట్టిన వరి ధాన్యం విలువ కోట్లలో**
13,399 వేల కోట్లు.
**వసూలు చేయబడిన బకాయిలు**
30.16 లక్షల టన్నులు వరి ధాన్యం
విలువ: 6.365 వేల కోట్లు.
**రికవరీ పెండింగ్లో ఉన్నవి**
21.81 లక్షల టన్నుల వరి ధాన్యం
విలువ: 4.939 కోట్లు బకాయి ఉన్నాయి.



## విద్యార్థులను తరగతి గదికే పరిమితం చేయకూడదు

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యం
- జాతీయస్థాయిలో ఉత్తమ టీచర్లుగా ఎంపికైన వారితో మోదీ సమావేశం
- విద్యార్థుల చదువు గురించే కాకుండా వారి దైనందిన జీవితాలపై కూడా టీచర్లు శ్రద్ధ వహించాలి
- నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోతోంది
- ఈ సమయంలో ఉపాధ్యాయులే విద్యార్థులను సరైన దారిలో నడిపించాలి
- మాదకద్రవ్యాల సమస్యను ప్రస్తావిస్తూ.. పిల్లలు ఏం చేస్తున్నారు,
- ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారనే విషయాలను నిరంతరం గమనిస్తూ ఉండాలి
- "విద్యార్థులు స్క్రీన్‌ను చూసే సమయాన్ని తగ్గించాలి
- నూతన సాంకేతికతలపై వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి.
- బోధనతో విద్యార్థుల్లో చాలా మార్పు తీసుకురావచ్చు.
- విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు.
- ప్రతి చిన్నారిలో ఒక టాలెంట్ ఉంటుంది. దానిని టీచర్లు గుర్తించి, ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ గౌడ్‌కు ఘన సన్మానం



**పెద్దపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సింగం కిరణ్‌కుమార్ గౌడ్ నియమితులైన సందర్భంగా మండలంలోని గ్రామ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఆయన నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని అన్నారు. నూతన అధ్యక్షుడు పార్టీని ఏకతాటిపైకి తీసుకువచ్చి బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

## బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం సాయం



**రాజపేట సెప్టెంబర్: 05(తెలంగాణ వాణి విలేకరి)**
మండల కేంద్రంలోని నేమిల గ్రామంలో మృతి చెందిన పులి చిన్న నర్సమ్మ కుటుంబానికి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బీర్ల అనిత సహకారంతో 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేమిల సర్పంచ్ పులి రాజు ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు జెట్ట సిద్దులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరా పార్క్ వద్ద బిజెపి దీక్షలో పాల్గొన్న బిజెపి నాయకులు.




**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 5, (తెలంగాణ వాణి):**
హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద భూ భారతి పై బిజెపి చేపట్టిన మహా దీక్ష లో తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు, బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి లకు మద్దతుగా శనివారం సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ మహా దీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే 22 ఏ భూములపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. 22 ఏ కు సంబంధించి పేద ప్రజల భూములకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు



**ధర్మారం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ధర్మారం మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు ఎంపికై కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఈఓ శారద చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ వారిని అభినందించారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసినందుకు అవార్డులు దక్కాయని తెలిపారు. అవార్డు పొందిన వారిలో రచ్చపల్లి ఎస్జీటీ సముద్రాల సంపత్, ఖిలవనపర్తి స్కూల్ అసిస్టెంట్ టి. స్వప్న, నందిమేడారం వి. రజిత, మల్లాపూర్ తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల జూనియర్ లెక్చరర్ బి. సాగరిక, నందిమేడారం గురుకుల పాఠశాల పీజీటీ పి. మాధవి ఉన్నారు.

## అలుగునూరులో కేటీఆర్‌కు రాఖీల స్వాగతం

**తిమ్మాపూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన నిరసన దీక్షకు వెళ్తున్న ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అలుగునూరు చౌరస్తాలో శనివారం ఘన స్వాగతం లభించింది. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సందర్భంగా మహిళలు కేటీఆర్‌కు రాఖీలు కట్టి అభిమానాన్ని చాటుకోగా, నాయకులు క్రేన్ సాయంతో భారీ గజమాలతో సన్మానించారు.



అనంతరం కేటీఆర్ కరీంనగర్‌కు బయలుదేరుతుండగా ట్రాఫిక్ రద్దీలో లారీ ఆయన కారును స్వల్పంగా ఢీకొనడంతో డోర్ దెబ్బతింది. ఎవరికీ గాయాలు కాలేదు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చలో ఇందిరా పార్క్: 22-A నిషేధిత భూములపై బిజెపి మహాధర్నా!

**పటాన్ చెరు, సెప్టెంబర్ 5, (తెలంగాణ వాణి)**
మీ భూములు మీవే... మీ హక్కులు మీవే! అనే నినాదంతో, రైతుల భూములను దౌర్జన్యంగా 22–ఏ నిషేధిత జాబితాలో చేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిపై బిజెపి సింహ గర్జన చేసింది. ఇందులో భాగంగా శనివారం నాడు ఇందిరా పార్కు వద్ద బాధితులు, రైతుల తో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ మెడలు వంచి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడేందుకు, భారీ నిరసన దీక్షకు గడ్డ పోతారం మున్సిపాలిటీ బిజెపి కన్వీనర్, అధ్యక్షులు మద్దూరి రాజు నాయకత్వంలో పార్టీ శ్రేణులు, బాధితులు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మోర్చా ఉపాధ్యక్షులు నల్లగండ్ల అశోక్ కుమార్, ఓ బి సీ మోర్చా మున్సిపాలిటీ అధ్యక్షులు మద్దూరి పటేల్ బాలయ్య, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మద్దూరి మాణిక్యం, బూత్ అధ్యక్షులు అగ్రారం




వెంకటేష్, యువ నాయకుడు గాండ్ల శివ ముదిరాజ్, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ధర్నాను విజయవంతం చేశారు.

## పిల్లలతో తల్లిదండ్రులు స్నేహితుల్లా ఉండాలి



**ధర్మారం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలలో చైల్డ్ సైకాలజిస్ట్ రజని వసుప్రధ ఆధ్వర్యంలో మోటివేషనల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల భయాలు, సమస్యలను తల్లిదండ్రులు అర్థం చేసుకుని ప్రేమగా మాట్లాడాలని సూచించారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత, నిద్రకు ముందు కొంత సమయం పిల్లలతో మాట్లాడి వారి ఇష్టాలు, సమస్యలను తెలుసుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి, పిల్లలతో తల్లిదండ్రులే ఎక్కువ సమయం గడపాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో తల్లిదండ్రులు ఆదర్శంగా నిలవాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులను తల్లిదండ్రులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సముద్రాల వంశీ మోహనాచార్యులు, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సౌమ్య, కాట నర్సయ్య పాల్గొన్నారు.



## ఖాదిరాబాద్ పాఠశాలలో ఘనంగా జన్మాష్టమి వేడుకలు

**పటాన్‌చెరు, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
వట్పల్లి మండలం ఖాదిరాబాద్ ప్రాథమిక పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలరించగా, చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుడి బోధనలు, సత్యం, ప్రేమ, కరుణ వంటి విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని హెచ్ఎం కవితకుమారి సూచించారు. పండుగల ద్వారా సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి. సుజాత, అలేఖ్య, సిద్ధప్ప, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్‌కు ఘన సన్మానం



**జమ్మికుంట, సెప్టెంబరు 5 (టుడేస్ న్యూస్)**
: కరీంనగర్ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పవన్ కుమార్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్ ఘనంగా సన్మానించారు. శనివారం ఆయన నివాసానికి వెళ్లిన రమేష్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సేవల్లో పవన్‌కుమార్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గూడెల్లి తిరుపతి, బిట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అరటిపండ్లతో భక్తాంజనేయ స్వామివారికి ప్రత్యేక అలంకరణ

**జమ్మికుంట , సెప్టెంబర్ 5 ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామచంద్రరావు



ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తీసుకువచ్చిన సుమారు 2 వేల అరటిపండ్లతో (కదళీఫలాలతో) శ్రీ భక్తాంజ నేయ స్వామివారిని ఆకర్షణీయంగా అలంకరించారు. అరటి పండ్లతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**జమ్మికుంట, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఏబీవీపీ జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి. రమేష్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఏబీవీపీ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బోగం శశాంక్, పాలిక నిరూప్, మోయిజ్, సల్మాన్, నికిత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## దొంగల ఆటకు చెక్

### 25 చోరీ కేసులు ఛేదించిన నిర్మల్ పోలీసులు




**నిర్మల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
దేవాలయాలు, ఇళ్లు, దుకాణాల్లో వరుసగా చోరీలకు పాల్పడుతున్న నిందితుల ఆటకు నిర్మల్ పోలీసులు చెక్ పెట్టారు. ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'టైగర్స్ టాస్క్‌ఫోర్స్' సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను గుర్తించింది. వీరికి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 25 చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 16 కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేశారు. మొత్తం 12 కిలోల వెండి ఆభరణాలు, ఆలయ కిరీటాలు, రూ.67 వేల నగదు, నిస్సాన్ మాగ్నైట్ కారు, మెల్టింగ్ మెషిన్, గ్యాస్ పైప్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఎలూరు, గన్నవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీల్లోనూ నిందితుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. కేసుల ఛేదనలో కృషి చేసిన భైంసా ఏఎస్పీ సాయికిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మిగిలిన కేసుల దర్యాప్తు కొనసాగుతోందని, దేవాలయాలు, ఇళ్లు, దుకాణాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## రాజీ మార్గమే రాజమార్గం



**మెదక్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఏసీ సెక్రెటరీ ఆర్. సిరి సౌజన్య కోరారు. శనివారం మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం, ధనం వృథా చేసుకునే బదులు పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమమని తెలిపారు. లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్, భూసేకరణ, మున్సిపల్, ఇన్సూరెన్స్, బ్యాంకు తదితర కేసులను ఎలాంటి ఖర్చు లేకుండా సత్వరమే పరిష్కరించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.



## పటాన్‌చెరులో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**పటాన్‌చెరు, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పటాన్‌చెరులోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, అన్నప్రసాద వితరణ కమిటీ, ధర్మకర్త మెట్టు రమాదేవి--కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిత్యహోమం, బలిహరణం, పల్లకీసేవ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అన్నదాన కమిటీ, ఎంకేవై టీం సభ్యులు, ఆలయ ధర్మకర్త మెట్టు కుమార్ యాదవ్‌ను సన్మానించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సేవలకు సహకరిస్తున్న వారందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## శంకరపట్నంలో మండల స్థాయి క్రీడా పోటీలు



**శంకరపట్నం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
శంకరపట్నం మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఈ నెల 10, 11 తేదీల్లో కేశవపట్నం ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ, మండల క్రీడా చైర్మన్ ఎం. లక్ష్మీనారాయణ తెలిపారు.
10న అండర్–14, అండర్–17 బాలికలకు, 11న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు మండల క్రీడల కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. షెడ్యూల్ ఖరారుపై తాడికల్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



**ధర్మారం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి)**
: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని చామనపల్లి, శాయంపేట సర్పంచులు వేల్పుల రేవతి--నాగరాజు, కూశ శ్రీవాణి--తిరుపతి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు జాడీ శ్రీనివాస్, ఉపాధ్యాయుడు పాట నరసయ్య, అంగన్వాడీ టీచర్ బద్దం భాగ్యలక్ష్మిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందించడంలో గురువుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు బోధనా విధానాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దెయ్యాల రజిత--రాకేష్, ఈఎన్ఎం మృణాళిని, ఆశా వర్కర్ పద్మ తదితరులు పాల్గొన్నా

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో వెయ్యి రోజుల విజయోత్సవ ర్యాలీ



**ఉట్నూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన కూడళ్ల మీదుగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుంది. అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పథకాలను వివరించారు. రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ క్యాంటీన్లు, మహిళా శక్తి కార్యక్రమాలతో పాటు విద్యార్థుల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ ప్రజల పట్ల బాధ్యత వహించాలని, వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారురు.




## రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా వై.శిరీష

**డిండి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండల కేంద్రంలోని గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వై.శిరీష రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో సెక్రటరీ శారద చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. 2021లో గ్రేడ్-2 ప్రిన్సిపాల్‌గా నియమితులైన శిరీష.. ఐదేళ్లలో మూడుసార్లు జిల్లా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డులు అందుకున్నారు. రాష్ట్రస్థాయి అవార్డు తన సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రుల సమష్టి కృషికి దక్కిన గుర్తింపుగా ఆమె పేర్కొన్నారు.

## బస్‌స్టాప్‌ను వెంటనే పునరుద్ధరించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసిన రఘునాథ్‌రెడ్డి



**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేకరి)**
చందానగర్--పటాన్‌చెరువు--ముంబై జాతీయ రహదారి పనుల్లో భాగంగా జ్యోతినగర్, అశోక్‌నగర్ సమీపంలో తొలగించిన బస్‌స్టాప్‌ను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బస్‌స్టాప్ తొలగింపుతో పరిసర కాలనీల ప్రజలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఆర్టీసీ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుల భద్రత కోసం అక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ) నిర్మించాలని కోరారు. సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

## ఓటర్ జాబితా నోటీసులపై స్పష్టత ఇవ్వాలి

### సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్



**కోహెడ, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేకరి)**
ఓటర్ జాబితా సవరణలో భాగంగా జారీ చేసిన నోటీసులపై అధికారులు స్పష్టత ఇవ్వాలని సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్ కోరారు. ఈ మేరకు శనివారం కోహెడ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని గ్రామాల వారీగా ఎన్ని ఎస్ఐఆర్ ఫారాలు స్వీకరించారు, ఎన్ని పరిశీలించారు, ఎన్ని తప్పిదాలు గుర్తించారు, ఎన్ని నోటీసులు జారీ చేశారు, ఎంతమంది సమాధానాలు ఇచ్చారనే పూర్తి వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలు, కారణాలను బీఎల్‌ఓలు స్పష్టంగా వివరించాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు కూడా తప్పిదాల కారణంగా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని శంకర్ కోరారు.

## రసమయి.. ముందు నీ భూకబ్జా తేల్చుకో!

### 5 ఎకరాల అటవీ భూమి స్వాధీనం కోసం త్వరలో ఆందోళన: ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఎల్ఎండీ కాలనీలో తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, స్మార్ట్ రేషన్ కార్డులు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ.. తనపై రూ.350 కోట్ల మెడికల్ కాలేజీ ఆరోపణలు నిరూపిస్తే కాలేజీని రసమయి బాలకిషన్‌కే రాసిస్తానని సవాల్ చేశారు. రసమయి ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తులకు మించి ఆస్తులు ఎలా కూడబెట్టారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అటవీశాఖకు చెందిన ఐదు ఎకరాల భూమిని ఆక్రమించి కోళ్లఫారం నిర్మించుకున్నారని ఆరోపిస్తూ, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. ఇందుకోసం త్వరలో ఆందోళన చేపడతామని ప్రకటించారు. గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోరాడితేనే హక్కులు సాధించుకోగలం

### నిరుద్యోగ యువత, విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం: చల్మెడ లక్ష్మీనరసింహారావు



**వేములవాడ, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పోరాడితేనే హక్కులు సాధించుకోగలమని, యువత తమ భవిష్యత్తు కోసం ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన, అమలు కాని హామీలను నిరసిస్తూ శనివారం వేములవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'పోరుబాట' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ నియామకాల విషయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిరుద్యోగ భృతి బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రుద్రంగి మండలంలో రూ.45 కోట్లతో ఏటీసీ ఏర్పాటు చేస్తామని భూమిపూజ చేసినా పనులు ప్రారంభించకపోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. ఆరు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో అప్పులే మిగిలాయి

### వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై విమర్శించే ముందు పదేళ్ల పాలనను గుర్తుచేసుకోండి: శ్రీనివాస్‌రావు



**కొడిపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని కొడిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు విమర్శించారు. శనివారం కొడిపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పులు, బకాయిల భారాన్ని అధిగమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పాలనను విమర్శించే ముందు తమ పదేళ్ల పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో కొందరు నాయకుల ఆస్తులు భారీగా పెరిగాయని ఆరోపిస్తూ, వాటిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కొడిపల్లి వార్డు సభ్యులు గౌడ్‌చర్ల ప్రశాంత్, సలావత్‌పూర్ సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రఘు, మొల్ల పాషా, కన్నారం మాజీ ఉపసర్పంచ్ పార్క్, కొర్ర శీను, నరహరి, జీవన్‌గౌడ్, కొట్టాల మాజీ సర్పంచ్ నరహరి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# విద్యార్థుల భవిష్యత్తులో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసి, లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ఎల్లారెడ్డిపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలను తెలుసుకున్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, ఉపాధ్యాయులు జ్ఞానం, దిశానిర్దేశం అందిస్తారని పేర్కొన్నారు. తన ఎదుగుదలలో గురువుల పాత్ర ఎంతో ఉందని గుర్తుచేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి లక్ష్యాలను సాధించాలని, సోషల్ మీడియా, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ సమరభేరి

**యువతతో కలిసి నాగిరెడ్డిపేట్‌లో భారీ ర్యాలీ**



**నాగిరెడ్డిపేట్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నాగిరెడ్డిపేట్‌లో విద్యార్థులు, యువతతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను



అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాజాల సురేందర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా యువతకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం**




**వేములవాడ, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వేములవాడ సుభాష్‌నగర్‌లోని లిటిల్ స్టార్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ అధ్యక్షురాలు, కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షులు ఎద్దండి రాజు సరళ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మమత అజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను తల్లిదండ్రుల్లా తీర్చిదిద్ది, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు, దూలం భూమేష్ గౌడ్, లలిత, గొట్టి నవీన్, వాసాల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మొలంగూర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**శంకరపట్నం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం మొలంగూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని, మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు నూతన విషయాలను నేర్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల విద్యాసారథి పురస్కారం అందుకున్న నీరజను ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా దర్గా ఉత్సవాలు

### ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన మతగురువులు



**నాగిరెడ్డిపేట్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నాగిరెడ్డిపేట్ మండలం గోపాల్‌పేట్ గ్రామంలోని పీరానే పీర్ గౌసే ఆజం దస్తగీర్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ దర్గా ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఖాన్‌ఖాయే ఆబిదుల్ హాష్మీ పీఠాధిపతి హజ్రత్ ముహమ్మద్ షరీఫోద్దీన్ షత్తారీ ఉల్ ఖాద్రీ ఆధ్వర్యంలో ఖురాన్ పఠనం, గంధం, చాదర్ సమర్పణ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఖవ్వాలీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కులమతాలకు అతీతంగా నిర్వహించిన ఉత్సవాలకు నాగిరెడ్డిపేట్‌తో పాటు ఎల్లారెడ్డి, లింగంపేట్, నిజాంసాగర్, పిట్లం, మెదక్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు సూఫీ మతగురువులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు రాయికోడ్ ఉపాధ్యాయులు



**రాయికోడ్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికోడ్ మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికై సన్మానం పొందారు. కర్చల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిములు, రాయికోడ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సునంద, రాయికోడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శోభ అవార్డులు అందుకున్నారు. సంగారెడ్డి జిల్లా ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో మెదక్ ఎంపీ సురేష్ షెట్కర్, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి అవార్డులు అందజేసి అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, నైతిక విలువలు, సృజనాత్మకత పెంపొందించేందుకు చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డులు లభించాయి. ముగ్గురికి ఒకేసారి అవార్డులు రావడంపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## తెలంగాణ వాణి రిపోర్టర్ దుర్గయ్యకు ఘన సన్మానం




**నర్సాపూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జానపద సాంస్కృతిక కళాకారుల సంబరాల్లో భాగంగా నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో తెలంగాణ వాణి రిపోర్టర్ దుర్గయ్యను ఘనంగా సన్మానించారు. మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, జానపద సాంస్కృతిక కళాకారుల సలహాదారు దరువు అంజన్న శాలువాతో సత్కరించి అభినందించారు. జానపద కళలు, కళాకారులను ప్రోత్సహించడంలో, వారి ప్రతిభను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర కీలకమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాకారులు, పాత్రికేయులు, కాంగ్రెస్ నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## నవభారత్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**హుస్నాబాద్ సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి ఆర్ సి)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠశాల కరస్పాండెంట్ గంగరవేని రవీందర్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు కరస్పాండెంట్ ను శాలువా కప్పి సన్మానించారు. విద్యార్థులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అందరికీ శాలువాలు కప్పి సన్మానించారు. విద్యార్థులు అందరూ గౌరవ పూర్వకంగాఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## కరీంనగర్‌లో ఘనంగా 1000 రోజుల ప్రజాపాలన సంబరాలు



**కరీంనగర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి)**
కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాచౌక్‌లో సంబరాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. 1000 రోజుల్లో 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, 15 లక్షల కొత్త రేషన్ కార్డులు, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ, సన్నవడ్లకు రూ.500 బోనస్ వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. 70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని పేర్కొన్నారు. అనంతరం పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో స్కూల్ బస్సును ఢీకొన్న ప్రైవేట్ బస్సు

### గాజు ముక్కలు తగిలి పలువురు విద్యార్థులకు గాయాలు



**సిరిసిల్ల, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న స్కూల్ బస్సును వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. దీంతో స్కూల్ బస్సు కిటికీ అద్దాలు పగిలి గాజు ముక్కలు తగలడంతో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. అప్పారెల్ పార్కులోని పంక్చువేట్ సంస్థకు చెందిన ప్రైవేట్ బస్సు ప్రమాదానికి కారణమైనట్లు ప్రాథమిక సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గురువుల సేవలు చిరస్మరణీయం

### విద్యార్థుల భవిష్యత్తుకు విలువలే పునాది




**డిండి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కందుకూరు గ్రామంలోని పాఠశాలలో వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులకు సుమారు రూ.లక్ష విలువైన స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీరామదాసు శ్రీను మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవర్చుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ కొమిరెల్లి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూనే మానవీయ విలువలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సర్పంచ్ బర్పాటి కొండల్, పూర్వ విద్యార్థి వానం నరేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మైనార్టీ గురుకులంలో న్యాయ విజ్ఞాన సదస్సు

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: న్యాయమూర్తి హేమలత



**నర్సాపూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: నర్సాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి, కమిటీ చైర్మన్ ఎం.హేమలత హాజరై విద్యార్థులకు న్యాయపరమైన అంశాలు, సైబర్ భద్రత, సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని, అవసరమైనప్పుడు ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ తారా సింగ్, న్యాయవాదులు రాజునాయక్, స్వరూపరాణి, మధుశ్రీ శర్మ, ప్రిన్సిపల్ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణకు శనిలా కాంగ్రెస్ సర్కార్



**కాంగ్రెస్ వెయ్యి రోజుల అసమర్థ పాలనపై బీఆర్ఎస్ నిరసన**

వనపర్తి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో రైతులు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో వెలమ ఫంక్షన్‌హాల్ నుంచి హౌసింగ్‌బోర్డు సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కరెంట్, సాగునీరు, ఎరువులు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, సకాలంలో విత్తనాలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.250 యూరియా కోసం రైతులు ఇతర నియోజకవర్గాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన రైతులు తిరిగి కేసీఆర్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆకట్టుకున్న యూరియా కష్టాల ప్రదర్శన: యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను బీఆర్ఎస్ శ్రేణులు వినూత్నంగా ప్రదర్శించారు. బస్టాండ్ కూడలిలో ఉట్టికి యూరియా బస్తాలు కట్టి వాటిని అందుకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

**చౌటుప్పల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, ఆటపాటల నడుమ అమ్మవారి విగ్రహాన్ని గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు 'జై ముత్యాలమ్మ తల్లి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ



నిర్మాణ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## గురువుల స్ఫూర్తితో ఉన్నతంగా ఎదగాలి

**-- వసతి గృహ సంక్షేమ అధికారి పసుల సత్యనారాయణ యాదవ్**

**వనపర్తి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహం (బి)లో శనివారం వేడుకలు నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారి పసుల సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు గురువుల స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విజయాల వైపు పయనించాలని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో తల్లి తొలి గురువని, ప్రాథమిక విద్య దశలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని



అన్నారు. గురువులు చూపిన మార్గంలో పయనిస్తూ క్రమశిక్షణ, మంచి విలువలను అలవర్చుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

## శ్రీ ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**నాంపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కొండాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో శ్రీ ముత్యాలమ్మ ఆలయ నూతన నిర్మాణానికి ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, సామాజిక సేవకుడు భీమరాజు నర్సింగ్ శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నర్సింగ్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును తానే భరించి సొంత నిధులతో ఆలయాన్ని నిర్మిస్తానని తెలిపారు. దేవాలయాలు ఆధ్యాత్మిక విశ్వాసాలతో పాటు సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా



నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే ప్రతి టీచర్ ఉత్తముడే

### ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతున్నాయి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**వరంగల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో)**
: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 841 పాఠశాలల్లో 1,56,995 మంది విద్యార్థులు చదువుతున్నారని, డిజిటల్ విద్య, ఎఫ్ఎల్ఎన్, అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని, 2024–-25లో 18వ స్థానంలో ఉన్న జిల్లా 2025–-26లో 9వ స్థానానికి చేరిందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈఓ ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**వనపర్తి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జి. విష్ణుమూర్తి అధ్యక్షతన రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవిస్తూ, గురువులను ఆదరించి, పెద్దల పట్ల మర్యాదగా మెలగాలని సూచించారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్ పోతురాజు, డాక్టర్ ఎల్. పుష్ప, డాక్టర్ జగదీశ్వరయ్య, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మన్నెం అన్న, దవులమ్మ, సరస్వతి, కాజన్న తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## తెల్లాపూర్ PHSలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**తెల్లాపూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెల్లాపూర్ ZPHSలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమానికి కొల్లూరు ఇన్‌స్పెక్టర్ సీహెచ్. సైదిరెడ్డి, ఎస్ఐ ఎస్. మురళి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది హాజరై ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొంటూ గురువులకు శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణలో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన: ఘనంగా బైక్ ర్యాలీ.!



**పరిగి/దోమ:సెప్టెంబర్05 (తెలంగాణ వాణి**
ప్రతినిది) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా, పరిగి శాసనసభ్యులు డాక్టర్ టీ. రామ్మోహన్ రెడ్డి,ఆదేశాల మేరకు దోమ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఒక భారీ బైక్ ర్యాలీని అత్యంత ఘనంగా నిర్వహించారు. బొంపల్లి గ్రామం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, మండల కేంద్రమైన దోమ వరకు కోలాహలంగా సాగింది. పార్టీ జెండాలతో, నినాదాలతో హోరెత్తిన ఈ బైక్ ర్యాలీలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గడపకూ చేరాయనే సంతోషంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ టీ. రామ్మోహన్ రెడ్డి సమర్థ నాయకత్వంలో నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. ఈ విజయోత్సవ ర్యాలీలో మండల కమిటీ బాధ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా డా. పి. సజ్జనకుమారి



**చిలుకూరు, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న డా. పి. సజ్జనకుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గత 30 ఏళ్లుగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఆమె.. పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సంస్కారం, తెలుగు భాషపై అభిమానం పెంపొందించడంలో విశేష కృషి చేశారని సహచర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

### -- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను నేర్పాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన 55 మంది ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ యాదయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, నిరుద్యోగులతో అరూరి రమేష్ భారీ ర్యాలీ

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి.. జీవో 97 రద్దు చేయాలి



**వర్ధన్నపేట, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా వర్ధన్నపేటలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆధ్వర్యంలో భీమారం జంక్షన్ నుంచి ఎర్రగట్టుగుట్ట జంక్షన్ వరకు విద్యార్థులు, నిరుద్యోగులతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇబ్బందిగా మారిన జీవో 97ను రద్దు చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**చౌటుప్పల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లికి చెందిన బోలమోని శంకరయ్య కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.26 వేల చెక్కును ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న, అడ్వకేట్ గట్టు మొగలయ్య ముదిరాజ్ శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ బీసీ రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పేద వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తెలంగాణ రాజ్యాధికార పార్టీ కృషి చేస్తుందని అన్నారు.

## కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**వనపర్తి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జి. విష్ణుమూర్తి అధ్యక్షతన రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవిస్తూ, గురువులను ఆదరించి, పెద్దల పట్ల మర్యాదగా మెలగాలని సూచించారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్ పోతురాజు, డాక్టర్ ఎల్. పుష్ప, డాక్టర్ జగదీశ్వరయ్య, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మన్నెం అన్న, దవులమ్మ, సరస్వతి, కాజన్న తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ కరపత్రం ఆవిష్కరణ



**జగిత్యాల, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
శ్రీ లోకమాత పోచమ్మ తల్లి దేవాలయం 64వ వార్షికోత్సవ ఉత్సవాల కరపత్రాన్ని ఆర్డీఓ పులి మధుసూదన్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

## జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య



**చిట్యాల, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చిట్యాల మండలం పాశీగడ్డ తండాకు చెందిన భూక్య తిరుపతి అలియాస్ సురేష్ (22) శుక్రవారం ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఎనిమిదేళ్ల క్రితమే మృతి చెందడంతో చదువు మానేసి కూలీ పనులు చేస్తూ ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలిని పోషిస్తున్నాడు. కుటుంబ బాధ్యతలు, తల్లిదండ్రులు లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు, బంధువులు తెలిపారు. కుటుంబసభ్యుడు భూక్య రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

### జీవో 97 రద్దు చేయాలని హనుమకొండలో బీఆర్ఎస్ విద్యార్థుల నిరసన





**హనుమకొండ, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్న జీవో 97ను రద్దు చేయాలని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలో నిరసన



చేపట్టారు. ఏకశిలా పార్కు నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు, యువత ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాక పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జీవో 97పై విద్యార్థులు, విద్యావేత్తలతో చర్చించి పరిష్కారం చూపాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు నిరసనకు వస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నప్పటికీ వారు ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

## జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్సీ ఎల్. రమణ అభినందనలు

**జగిత్యాల, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సభ్యులు శాసనమండలి ఉపనేత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణను శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.నూతన కార్యవర్గాన్ని ఎల్. రమణ అభినందిస్తూ వర్తకుల సమస్యల పరిష్కారానికి సంఘం చురుగ్గా పనిచేయాలని ఆకాంక్షించారు. అధ్యక్షుడిగా కమటాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా కప్పల శ్రీకాంత్,



ఉపాధ్యక్షుడిగా ఎలిమిల్ల చంద్రకాంత్, సహాయ కార్యదర్శిగా సామ సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు.





## సీఎం సభలో జగిత్యాల వాసికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**జగిత్యాల, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జగిత్యాల జిల్లాకు చెందిన భూముల నరేష్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. సీఎం సభలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యోగితారాణి, ఎం.జె.పీ. కార్యదర్శి బి. సైదులు చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు. నరేష్‌కుమార్‌కు అవార్డు దక్కడంపై జిల్లా వాసులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ఓటరు జాబితా నోటీసులపై స్పష్టత ఇవ్వాలి



**కోహెడ, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేకరి)**
: ఎస్ఐఆర్ ప్రక్రియలో జారీ చేసిన నోటీసులు, వాటి కారణాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్ కోరారు. ఈ మేరకు శనివారం కోహెడ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలో ఎన్ని ఎస్ఐఆర్ ఫారాలు స్వీకరించారు, ఎన్ని పరిశీలించారు, ఎన్ని తప్పిదాలు గుర్తించారు, ఎన్ని నోటీసులు జారీ చేశారు, వాటికి ఎంతమంది సమాధానాలు ఇచ్చారనే వివరాలను గ్రామాల వారీగా పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని ఆయన అన్నారు.

## గురువుల సేవలు అమూల్యం



**తిమ్మాపూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అధ్యాపకులను సన్మానించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రామ నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో, సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అమూల్యమని అన్నారు. విద్యాబోధనతోపాటు నైతిక విలువలను నేర్పాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఓడీలు డాక్టర్ ఎం. రవీందర్, డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటాపూర్ గేట్ వద్ద కారు--ఆటో ఢీ

### నలుగురికి తీవ్ర గాయాలు



**టేక్మాల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
టేక్మాల్ మండలం వెంకటాపూర్ గేట్ వద్ద శనివారం కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో దెబ్బతినడంతో రోడ్డుపై గాజు పెంకులు చెల్లాచెదురుగా పడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపారు.

## ఉపాధ్యాయులను సత్కరించిన సైబరాబాద్ సీపీ



**హైదరాబాద్/శేరిలింగంపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేకరి):**
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ గచ్చిబౌలిలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకమన్నారు. క్రమశిక్షణ, రోడ్డు భద్రత, మహిళల భద్రత, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోలీసులు, ఉపాధ్యాయులు కలిసి పని చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా





**కరీంనగర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న టెట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, అభ్యర్థులకు తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కేంద్రాల్లో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు, అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో చైతన్య జైనీ, వైద్య, పోలీసు, ఎన్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్‌కు ఘన సన్మానం

**వనపర్తి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వనపర్తి పట్టణంలోని 21వ వార్డు ఎస్సీ వాడ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ ద్యారపోగు లక్ష్మిని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ద్యారపోగు వెంకటేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప వ్యక్తులు గురువులని కొనియాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా గొర్ల శాంతమ్మ, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**హసన్‌పర్తి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. సీఐ ఆకుల మహేందర్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి ఎదగడంలో గురువుల పాత్ర ఎంతో ఉందని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల మెరుపుదాడి



**ధర్మారం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
ఎద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేదారం గ్రామంలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం మెరుపుదాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.23,580 నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**చిగురుమామిడి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేకరి):**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో శ్రీకృష్ణ మల్లికార్జున యాదవ్ యూత్ ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్థులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టి విజయం సాధించిన యువతకు యూత్ ఆధ్వర్యంలో రూ.5,016 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సీత అనిల్, ఉపాధ్యక్షుడు పంజా తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఆధారి అఖిల్‌కుమార్, క్యాషియర్ గద్ద కుమార్, యూత్ సభ్యులు, యాదవ సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## డీసీసీ ఎస్సీ సెల్ కార్యదర్శులుగా బొజ్జ చంద్రమౌళి, గడ్డం సంపత్



**శంకరపట్నం, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను గుర్తించి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శులుగా బొజ్జ చంద్రమౌళి, గడ్డం సంపత్‌లను నియమించారు. మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా శనివారం వారు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ఎస్సీ సెల్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాడికల్ సొసైటీ డైరెక్టర్ ఒడల రాజయ్య, దేవనూరి నరేష్, కనుకుట్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ జీవోను ఎత్తివేయాలి: బీజేపీ



**పెద్దపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
22ఏ జీవోను రద్దు చేసి రైతుల భూములకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన దీక్షకు అంతర్గాం మండల బీజేపీ నాయకులు తరలివెళ్లారు. రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో వారు దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ మాట్లాడుతూ 22ఏ జీవోను ఎత్తివేసి రైతుల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోలాహలంగా గురుపూజోత్సవం



**తిమ్మాపూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అలుగునూర్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ (సీఓఈ)లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ మాదవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను సత్కరించి వారి సేవలను అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మంచి విలువలు అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆసియా సుల్తానా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఖ

## అనారోగ్యంతో వాటర్ మెన్ మృతి

**రాజాపేట సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి విలేఖరి)**
రాజాపేట మండలం లోని కుర్రారం గ్రామంలో వాటర్ మెన్ గా పనిచేస్తున్న మేడి మల్లయ్య శనివారం ఉదయం అనారోగ్యంతో మరణించినాడు. మల్లయ్య గ్రామంలో దాదాపుగా 40 సంవత్సరాలు నుండి వాటర్ మేన్ సేవలు అందరూ అందిస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం మల్లయ్య కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## పాఠశాలల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**కోరుట్ల రూరల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
మండలంలోని పైడిమడుగు, కల్లూరు ఆదర్శ పాఠశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తరగతి గదుల్లో విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయ వృత్తి సవాళ్లతో కూడుకున్నదని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎలిగేడ్‌లో గంజాయి సేవించిన ఏడుగురు యువకులు అదుపులో




**పెద్దపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
ఎలిగేడ్ గ్రామంలో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు గంజాయి సేవించినట్లు తేలడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తదుపరి చర్యల్లో భాగంగా వారిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు.

## నెక్సస్ టెక్నో స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**నారాయణఖేడ్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నారాయణఖేడ్ పట్టణంలోని నెక్సస్ టెక్నో స్కూల్‌లో ప్రిన్సిపాల్ వి. నిర్మల ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ విద్యార్థులను సరైన దిశలో నడిపించే మార్గదర్శకులు ఉపాధ్యాయులని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## అల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**హుజురాబాద్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి)**
హుజురాబాద్‌లోని అల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే శిల్పులని అన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## శ్రీకృష్ణ నామస్మరణతో మారుమోగిన ఆలయాలు

**రాజాపేట, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేఖరి):**
రాజాపేట మండల కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ మఠంలో అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామి ఆలయంలోనూ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. భక్తుల భజనలు, ఆటపాటలతో ఆలయాలు భగవన్నామస్మరణతో మారుమోగాయి. కార్యక్రమాల్లో శ్రీమన్నారాయణ భక్త బృందం మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## కోర్కల్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

**వీణవంక, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మండలంలోని కోర్కల్ గ్రామ సర్పంచ్ రమ్యకృష్ణ--అనిల్, వార్డు సభ్యులు, కుల సంఘాల నాయకులతో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 150 మంది కాంగ్రెస్‌లో చేరారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు ఆకట్టుకోవడంతో పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. గ్రామ సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ప్రణవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉత్తమ బయోసైన్స్ ఉపాధ్యాయ అవార్డుకు రాజశేఖర్



**కోరుట్ల రూరల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
మండలంలోని మోహన్‌రావుపేటకు చెందిన లింగాల రాజశేఖర్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మేడిపల్లి మండలం మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న ఆయనకు శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అవార్డును అందజేశారు. అనంతరం మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించింది.

## రాజాపేటలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**రాజాపేట, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేఖరి):**
రాజాపేట మండల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాపోలు రామ చంద్రారెడ్డి, పాముకుంట స్కూల్ అసిస్టెంట్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గౌటే బాలరాజును పీఏసీఎస్ రేణికుంట చైర్మన్ మహేందర్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డా. చింతల రవి, ఐరేని నవీన్‌కుమార్, వైరాగ్యం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 29వ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధి



**పెద్దపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం నగరపాలక సంస్థ 29వ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. హౌసింగ్ బోర్డు కాలనీ, ఇందిరమ్మ ఫ్లాట్స్, ఆదర్శనగర్, గంగపుత్ర కాలనీల్లో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఫ్లాట్స్‌లో నూతన విద్యుత్ స్తంభాలు, పైప్‌లైన్ పనులు చేపట్టారు. డివిజన్‌లో విద్యుత్, తాగునీరు, పారిశుధ్య సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి తెలిపారు. వీధిలైట్ల ఏర్పాటుతో రాత్రివేళ ప్రజలకు భద్రత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5, (తెలంగాణ వాణి ప్రతినిధి )**
నారాయణఖేడ్ పట్టణంలోని పంచగమా కమాన్ వద్ద శనివారం నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమానులు హన్మయ్య ముదిరాజ్, సతీష్, పరమేశ్వర్‌లను ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, పీసీసీ సభ్యులు కె. శ్రీనివాస్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొని నూతన గృహ యజమానులు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## గురువుల సేవలు చిరస్మరణీయం




**జమ్మికుంట, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేసే గురువుల సేవలు చిరస్మరణీయమని ఆయన అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కళాశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గోలివాడ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**పెద్దపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
అంతర్గాం మండలం గోలివాడ ఎంపీయూపీఎస్ పాఠశాలలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జొన్నల రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తూ విద్యతో పాటు విలువలను నేర్పుతున్న ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు బండి సంజయ్‌ను విమర్శించే నైతిక అర్హత లేదు



**కరీంనగర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సొంత పరిజ్ఞానం లేదని, ఫాంహౌస్ నుంచి వచ్చే స్క్రిప్ట్‌లనే చదువుతున్నారని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు విమర్శించారు. శనివారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లో జరిగిన సమరభేరి సభలో కేటీఆర్ 12 పేజీల స్క్రిప్ట్ చదివారని ఆరోపించారు. సొంత అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేని కేటీఆర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. బండి సంజయ్ కరీంనగర్‌కు తీసుకొచ్చిన అభివృద్ధి, నిధులపై ప్రజలకు అవగాహన ఉందని తెలిపారు. ఇకనైనా కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ప్రవీణ్‌రావు సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి 7 రోజుల జైలు




**పెద్దపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
మద్యం సేవించి వాహనాలు నడిపిన 16 మందిపై రామగుండం ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి గోదావరిఖని పీజే కోర్టు మేజిస్ట్రేట్ వెంకట సచిన్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం 15 మందికి రూ.41,500 జరిమానా విధించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో కమ్యూనిటీ సర్వీస్ చేయాలని ఆదేశించారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న మరో వ్యక్తికి 7 రోజుల జైలు శిక్ష విధించడంతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు హెచ్చరించారు. వాహనదారులు హెల్మెట్ ధరించి, రాంగ్‌రూట్, అతివేగానికి దూరంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన సంధ్యకు ఘన సన్మానం



**పెద్దపల్లి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండంలోని తబిత నిస్సహాయ పిల్లల ఆశ్రమంలో పెరిగి, ప్రతిభతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన వానరాసి సంధ్యను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పేద, నిస్సహాయ పరిస్థితులను అధిగమించి వైద్య విద్యలో సీటు సాధించడం అభినందనీయమని చందర్ అన్నారు. సంధ్య ఉన్నత స్థాయికి ఎదిగి మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**రాజాపేట, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేఖరి):**
రాజాపేట మండలానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై శనివారం ఘనంగా సన్మానం పొందారు. దూది వెంకటాపురం ఉన్నత పాఠశాల సీనియర్ హిందీ పండిట్ బల్ల వెంకటేశ్వర్లు, రాజాపేట ఉన్నత పాఠశాల బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఏ. అనిత, చల్లూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ స్కూల్ అసిస్టెంట్ పి. రాజు, దూది వెంకటాపురం ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం బి. స్వరూప, ఐఈఆర్‌టీ టి. సంధ్యా రాణిని అధికారులు సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు .కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, అదనపు కలెక్టర్ భాస్కరరావు, డీఈఓ బందారపు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని దూది వెంకటాపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అభినందించారు.




## పోలీసుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం

**పటాన్‌చెరు, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి)**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు పోలీసులు పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ ఎం. రవీందర్, ఎస్ఐ ఎం. మహేశ్వర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరమణి తదితరులు ఉపాధ్యాయులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, మహిళలు, బాలల రక్షణపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సీఐ రవీందర్ కోరారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**లక్షెట్టిపేట, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి)**

: మండలంలోని మిట్టపెల్లి ప్రభుత్వ పాఠశాలలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. లక్షెట్టిపేట హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ట్రస్ట్ అధ్యక్షుడు బొద్దు రవి జోసఫ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. అనంతరం 25 మంది విద్యార్థులకు ట్రస్ట్ తరఫున పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాతరాజు బానేష్, హెచ్‌ఎం బి. గోపీనాథస్వామి, ఉపాధ్యాయురాలు జి. స్వప్న, అంగన్వాడీ టీచర్ ఎన్. కనకదుర్గ, పంచాయతీ కార్యదర్శి ఏ. రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**మందమర్రి సెప్టెంబర్ 05 (తెలంగాణ వాణి)**

ఉపాధ్యాయ దినోత్స వాన్ని పురస్కరించుకొని పట్టణం లోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను పోషిస్తూ స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పాఠశాల నిర్వహణపై అవగాహన పొందారు. అనంతరం విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా ఆటలు వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

## ఆల్ఫోర్స్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




**నిర్మల్ - భైంసా: సెప్టెంబర్ 05 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత మాజీ రాష్ట్రపతి,ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. విద్యార్థులే ఉపాధ్యాయుల పాత్రలు పోషిస్తూ తరగతులను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమకంటే ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో గౌరవం పొందడమే ఉపాధ్యాయులకు నిజమైన గర్వకారణమన్నారు. అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించే అరుదైన అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు మమతానుబంధాన్ని పెంపొందించుకోవాలని,వారిని బాధ్యతాయుతమైన భావిపౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అధ్యాపకులకు ఘన సన్మానం



**నిర్మల్ - భైంసా: సెప్టెంబర్ 05 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భైంసా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలోని మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ స్టడీ సర్కిల్‌లో కానిస్టేబుల్,ఎస్ఐ ఉచిత కోచింగ్ అభ్యర్థులకు బోధిస్తున్న అధ్యాపకులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ శాలువాలతో సత్కరించారు. అనంతరం అధ్యాపకులతో కలిసి టిఫిన్ చేసి,తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు విద్యాపరంగా లేదా అవసరమైన వనరుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఇన్‌చార్జీలు,అధ్యాపకులు లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అభ్యర్థుల విజయానికి ప్రజా ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మోహన్‌రావు పాటిల్ తెలిపారు.

# రైతన్న కంట కన్నీరు రేవంత్ పాలనకు నిదర్శనం

- రైతుల భూములపై 22ఏ నిషేధం ఎత్తివేయాలి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే బర్తరఫ్ చేయాలి
- రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
- పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**గుమ్మడిదలలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతన్న పోరుబాట**



**పటాన్ చెరు, సెప్టెంబర్ 5, (తెలంగాణ వాణి):**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెయ్యి రోజుల పాలనలో వ్యవసాయ రంగం విధ్వంసం కావడంతో పాటు.. రైతన్న పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 మోసాల పైన బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరు బాటలో భాగంగా శనివారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతన్న పోరు బాట కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో విప్లవత్మక మార్పులు తీసుకొని రావడంతో పాటు రైతుని రాజు చేస్తానంటూ ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం,. రైతుబంధు, రైతు బీమా వంటి విప్లవాత్మక పథకాలకు చరమ గీతం పాడడంతో పాటు, కనీస మద్దతు ధర అందించక రైతన్న పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కేసీఆర్ హయాంలో గ్రామాల సమగ్ర అభివృద్ధి**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 సంవత్సరాలు పోరాడిన కేసీఆర్.. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడంతో పాటు రైతులకు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వ్యవసాయ రంగానికి అండగా నిలిచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు విద్యుత్ సమస్యల కారణంగా పొలాల్లో మోటార్లు ఆన్ చేసేందుకు వెళ్లిన రైతులు పాముకాట్లకు, ఇతర ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని, ఆ పరిస్థితులను మార్చేందుకు 24 గంటల విద్యుత్ సరఫరా తీసుకొచ్చిన మహోన్నత నాయకుడు కెసిఆర్ అని గుర్తు చేశారు.

**22ఏ పేరుతో రైతులను వేధించడం సరికాదు**

ప్రస్తుతం జిన్నారం, గుమ్మడిదల తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆరోపించారు. రైతుల భూములను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి వారిని మానసికంగా, ఆర్థికంగా వేధించడం తగదన్నారు. రైతుల భూముల విషయంలో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పదవి నుంచి తప్పుకోవాలని, లేకపోతే ముఖ్యమంత్రి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

**రైతుల భూములను కాపాడేందుకు పోరాటం**

ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పరిశ్రమల కోసం కేటాయించిన భూముల విషయంలోనూ అనేక సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల భూముల విషయంలో అక్రమాలు, మధ్యవర్తుల జోక్యం ఉంటే వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాల్సిన ప్రభుత్వం, ఉన్న భూములపైనే వివాదాలు సృష్టించడం సరికాదన్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. రైతులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని.. బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణే ధ్యేయం



**ఉట్నూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి)**

: గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ తండాలో టీబీ రహిత గిరిజన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా పిరమల్ ఫౌండేషన్ సహకారంతో ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్ మండలాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ పూర్తిగా నయమవుతుందని, అపోహలకు గురికావద్దని సూచించారు. అనంతరం తీజ్ ఉత్సవాల్లో కలెక్టర్ అధికారులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. సాధన, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## గిన్నిస్ రికార్డు సాధించిన నబియా సుల్తానాకు ఘన సన్మానం

**ఎల్లారెడ్డి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సయ్యద్ నబియా సుల్తానా అరుదైన గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించిన 36 గంటల 'ఏజెంటిక్ ఏఐ హ్యాకథాన్--2025'లో పాల్గొని 2,089 మందితో కలిసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో భాగస్వామిగా నిలిచిన నబియా సుల్తానాను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు షేక్ గయాజుద్దీన్, ఉపాధ్యక్షులు సయ్యద్ మీర్, ముక్రమ్ అలీ, ప్రధాన కార్యదర్శి అజీజుర్ రెహమాన్, సభ్యులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థుల పోరుబాట



**కామారెడ్డి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి తాడ్కోల్ చౌరస్తా వరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, వీజీ గౌడ్, మోరెల్ శ్రీనివాస్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మాజీ ఎమ్మెల్యే

**ఎల్లారెడ్డి, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

: లింగంపేట్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అధికారులతో విద్యుత్ సరఫరా, స్థానిక సమస్యలపై చర్చించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## ఉపాధ్యాయులే సమసమాజ నిర్మాతలు



**నిర్మల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేఖరి):**

విద్యార్థులకు జ్ఞానం, నైపుణ్యంతో పాటు జీవితాన్ని ఎదుర్కొనే శక్తిని అందించి, భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ సన్మార్గంలో నడిపించాలని సూచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఏఐ యుగంలో పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో పఠన అలవాటు, శోధనాత్మక దృక్పథం, ఆచరణాత్మక ఆలోచనలను పెంపొందించాలని కోరారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ భోజన్న, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జామి ప్రసాదరావుకు నేషనల్ ఎడ్యుకేషన్ శిరోమణి అవార్డు

**మందమర్రి సెప్టెంబర్ 05 (తెలంగాణ వాణి)**



స్వదేశ్ సంస్థాన్ ఇండియా అయోధ్య వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ ఎడ్యుకేషన్ శిరోమణి అవార్డు ను సింగరేణి (ఎయిడెడ్) ఉన్నత పాఠశాల, కళ్యాణిఖని లో సీనియర్ హిందీ పండితులుగా సేవలందిస్తున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు అందుకున్నారు. విద్యారంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కా రాన్ని ప్రదానం చేశారు. ఈ అవార్డు అందుకోవ డం పట్ల మందమర్రి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, ఉపాధ్యా యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి జామి ప్రసాదరావును అభినం దించారు. విద్యారంగంలో ఆయన చేస్తున్న సేవలకు ఈ పురస్కారం మరింత గుర్తింపును తీసుకువచ్చిందని పలువురు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి గొప్ప సేవ




**నిజామాబాద్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రెవ. డా. యు. నిర్మల మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం మాత్రమే కాదని, సమాజ నిర్మాణానికి సంబంధించిన గొప్ప సేవా బాధ్యత అని అన్నారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సరిత మాట్లాడుతూ విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, బాధ్యత, మానవత్వాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు నిరంతరం జ్ఞానాన్ని పెంపొందించుకుని విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని కళాశాల ప్రిన్సిపల్ ఇన్నాలు అన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, ప్రసంగాలతో ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ సుందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలి

**16న ఉట్నూర్ ఐటీడీఏ ముందు భారీ నిరసన**



ఉట్నూర్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి)

ఆదివాసుల అస్తిత్వ పరిరక్షణ, యువతీ యువకులకు ఉద్యోగాలు, షెడ్యూల్డ్ ప్రాంతాల హక్కుల సాధన కోసం ఈ నెల 16న ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. ఉట్నూర్ ఆదివాసీ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఆదివాసీ హక్కుల అమలుతో పాటు నీళ్లు, నిధులు, నియామకాల్లో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్చ్‌కు ఆదివాసీలు, యువత, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్క బాపూరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి కూడ్మేత తిరుపతి, జిల్లా అధ్యక్షులు కోవా విజయ్‌కుమార్, పెందోర్ దాదిరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు




**నిర్మల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేఖరి):**

జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసరలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం బాసరలో పర్యటించిన కలెక్టర్ శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయం, గోదావరి పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్, భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం భైంసా తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి, నోటీసుల జారీ, తదుపరి ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేసి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, పాల్గొన్నారు.



## సంక్రాంతి రేసులో 'కాకా'.. హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్!

లటాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి రికార్డులను తిరగరాసేందుకు మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ (కె.ఎస్. రవీంద్ర) మరో అడుగు ముందుకు వేస్తున్నారు. వీరిద్దరి కలయికలో ఇప్పటికే వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'వాల్తేరు వీరయ్య' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమాకు సంబంధించిన కీలకమైన షూటింగ్ అప్‌డేట్‌ను చిత్రబృందం వెల్లడించింది. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తదుపరి కీలక షెడ్యూల్ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ తాజా షెడ్యూల్‌లో సినిమాలోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి దర్శకుడు బాబీ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు మరియు షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న మేకర్స్, ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కొత్త లుక్‌లో కనిపించబోతున్న ఈ చిత్రంలో ఆయనతో పాటు నటి అనస్వర రాజన్, నివేతా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## సూర్య 50వ సినిమా అదేనా..

### 'రోలెక్స్'పై హీరో క్లారిటీ,
### లోకేష్ కనగరాజ్ చేతికి కీలక బాధ్యత!

తమిళ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో ఉన్నారు. కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, కమర్షియల్ సినిమాలతో పాటు కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్‌తోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆయన.. ప్రస్తుతం భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి సినిమాలతో సక్సెస్ అందుకున్న సూర్య.. తన నెక్స్ట్ సినిమాల విషయంలో మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వీటన్నింటికంటే ఇప్పుడు సినీ అభిమానుల దృష్టి సూర్య కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన 50వ సినిమాపైనే ఉంది. ముఖ్యంగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'విక్రమ్' సినిమాలో పరిచయం చేసిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ రోలెక్స్‌ను హీరోగా పెట్టి ఓ పూర్తి స్థాయి సినిమా తెరకెక్కనుందనే ప్రచారం ఎప్పటి నుంచో కొనసాగుతోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై సూర్య స్వయంగా చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. కమల్ హాసన్ హీరోగా లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన 'విక్రమ్' సినిమాలో సూర్య కొద్దిసేపు మాత్రమే కనిపించారు. అయితే చివర్లో డ్రగ్ లార్డ్ రోలెక్స్‌గా ఆయన ఇచ్చిన ఎంట్రీ మాత్రం సినిమాకే హైలైట్‌గా నిలిచింది. భయంకరమైన లుక్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్, క్రూరమైన నటనతో సూర్య పోషించిన రోలెక్స్ క్యారెక్టర్ ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసింది. సినిమా పూర్తయిన తర్వాత కూడా రోలెక్స్ పాత్రపై చర్చ కొనసాగింది. ఈ పాత్రను ఆధారంగా చేసుకుని పూర్తి స్థాయి సినిమా రావాలని అప్పటి నుంచే అభిమానులు కోరుతున్నారు. లోకేష్ కనగరాజ్ క్రియేట్ చేసిన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లో రోలెక్స్ పాత్రకు ఉన్న ప్రాధాన్యత కూడా ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచింది. తాజాగా సూర్య ఈ ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ.. లోకేష్ కనగరాజ్ ప్రస్తుతం 'రోలెక్స్' కథకు సంబంధించిన పూర్తి స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారని వెల్లడించినట్లు సమాచారం. దీంతో ఇంతకాలం కేవలం ప్రచారంగా వినిపించిన 'రోలెక్స్' ప్రాజెక్ట్‌పై ఇప్పుడు మరోసారి భారీ చర్చ మొదలైంది. లోకేష్ పూర్తి స్థాయి స్క్రిప్ట్ సిద్ధం చేసి సూర్యకు వినిపించిన తర్వాతే ఈ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందనే విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సూర్య కెరీర్‌లో 50వ సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌ను అభిమానులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. అందులోనూ 'విక్రమ్'లో రోలెక్స్‌గా సూర్యకు వచ్చిన క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుంటే.. అదే పాత్రతో పూర్తి సినిమా వస్తే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే సూర్య 50వ సినిమా 'రోలెక్స్'గానే ఉంటుందని ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. సూర్య స్వయంగా చెప్పిన వివరాల ప్రకారం లోకేష్ ఈ కథను సిద్ధం చేస్తున్నారన్న విషయం మాత్రం ప్రాజెక్ట్‌పై ఆసక్తిని మరింత పెంచుతోంది.





## జాతీయ లోక్‌అదాలత్ విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

**నిర్మల్, సెప్టెంబరు 5 (తెలంగాణ వాణి విలేఖరి):**

ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అర్హత కలిగిన క్రిమినల్ కాంపౌండబుల్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా పోలీసు, న్యాయ, ప్రాసిక్యూషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ మేరకు నిర్మల్‌లో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు.

పెండింగ్ కేసులను గుర్తించి కక్షిదారులతో సమన్వయం చేస్తూ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో కేసుల వివరాలను సకాలంలో నమోదు చేసి అప్‌డేట్ చేయాలని తెలిపారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో పోలీసు, ప్రాసిక్యూషన్, న్యాయస్థానాల సమన్వయం కీలకమని ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్నారు. కార్యక్రమంలో జిల్లా సెషన్స్ జడ్జి ఎస్. శ్రీవాణి, డీఎల్ఎస్ఏ జడ్జి పి. రవీందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేవేందర్, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్లి ఫౌండేషన్ మండల ఇన్‌చార్జీలుగా కవిత, కృష్ణవేణి

### మహిళల సమస్యలు, సాధికారత, సంక్షేమం కోసం కృషి




**కొత్తగూడెం, సెప్టెంబర్ 5 (తెలంగాణ వాణి)**

లక్ష్మీదేవిపల్లి మండలంలో మహిళల సమస్యలు, సాధికారత, సంక్షేమ కార్యక్రమాలపై పనిచేసేందుకు కొల్లి ఫౌండేషన్ మండల ఇన్‌చార్జీలుగా కె.కవిత, జె.కృష్ణవేణిని నియమించింది. ఫౌండేషన్ చైర్‌పర్సన్ కల్పనా చౌదరి వారి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. మహిళలకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కల్పనా చౌదరి సూచించారు. మహిళల అభ్యున్నతి, ఆత్మగౌరవం, స్వావలంబన కోసం కృషి చేస్తామని కవిత, కృష్ణవేణి తెలిపారు.

## హీరోయిన్ల వివాదంపై తాప్సీ షాకింగ్ కామెంట్స్..

### ప్రేక్షకులనే నిందిస్తూ మేకర్స్ తప్పించుకుంటున్నారా?

సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన రామ్ చరణ్ 'పెద్ది' , కన్నడ స్టార్ హీరో యష్ నటించిన 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రాల్లో మహిళా పాత్రలను ప్రెజెంట్ చేసిన తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. హీరోయిన్ల పాత్రలు, వారి లుక్, దుస్తులు, కెమెరా యాంగిల్స్ విషయంలో గ్లామర్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనే అభిప్రాయాలు నెటిజన్ల నుంచి వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా హీరోయిన్ తాప్సీ పన్ను చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తన తాజా చిత్రం 'గాంధారి' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ.. సినిమా పరిశ్రమలో 'డిమాండ్ అండ్ సప్లై' విధానం, సోషల్ మీడియా విమర్శలు, ప్రేక్షకుల అభిరుచులపై కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమాల్లో హీరోయిన్లను గ్లామర్‌గా చూపించడంపై సోషల్ మీడియాలో వచ్చే విమర్శల గురించి తాప్సీని ప్రశ్నించగా.. డిజిటల్ ప్రపంచానికి, గ్రౌండ్ లెవల్‌లో ఉన్న ప్రేక్షకుల అభిప్రాయాలకు చాలా తేడా ఉంటుందని ఆమె చెప్పింది. ముఖ్యంగా మాస్ సినిమాల విషయంలో సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు సినిమాలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని తాప్సీ అభిప్రాయపడింది. నెట్‌లో ఎంత చర్చ జరిగినా.. అదే గ్లామర్ ఫొటోలను జూమ్ చేసి, వివిధ యాంగిల్స్‌లో వీడియోలు తయారు చేసి వైరల్ చేసే వాళ్లు కూడా సోషల్ మీడియాలోనే ఉన్నారని ఆమె పేర్కొంది. అంటే ఒకవైపు అదే కంటెంట్‌ను విమర్శిస్తూ.. మరోవైపు దానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను వైరల్ చేయడం కూడా జరుగుతోందని తాప్సీ చెప్పుకొచ్చింది. దీనిని బట్టి అలాంటి కంటెంట్‌కు సోషల్ మీడియాలో కొంత మేర ఆదరణ ఉందనే విషయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని ఆమె అభిప్రాయపడింది. సినిమా పరిశ్రమలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయన్న దానిపై తాప్సీ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఇండస్ట్రీలో కూడా డిమాండ్ అండ్ సప్లై సూత్రమే పనిచేస్తుందని ఆమె చెప్పింది. ప్రేక్షకులు ఇలాంటి కంటెంట్‌ను కోరుకుంటున్నారని, దాని ద్వారా సినిమాలకు డబ్బులు వస్తాయని నిర్మాతలు, దర్శకులు భావించినప్పుడు అదే తరహా సినిమాలు, సన్నివేశాలు తెరకెక్కుతాయని తాప్సీ పేర్కొంది. అలా క్రమంగా సినిమా కథ, కళ, నటన వంటి అంశాలు వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆమె అభిప్రాయపడింది. కరోనా మహమ్మారికి ముందు సినీ పరిశ్రమ మంచి మార్పు దిశగా పయనించిందని తాప్సీ చెప్పింది. అయితే ప్రస్తుతం మళ్లీ కొన్ని పాత పద్ధతులు తిరిగి వస్తున్నాయని ఆమె అభిప్రాయపడింది. సినిమా ఆశించిన స్థాయిలో లేకపోతే దానికి ప్రేక్షకుల అభిరుచులను కారణంగా చూపుతూ మేకర్స్ తప్పించుకునే పరిస్థితి ఉందని తాప్సీ వ్యాఖ్యానించింది. నటీనటులు పరిశ్రమలో మార్పు కోసం ఎంత ప్రయత్నించినా.. ప్రేక్షకుల నుంచి మద్దతు లేకపోతే ఆ పోరాటంలో విజయం సాధించడం కష్టమని ఆమె చెప్పుకొచ్చింది.




Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com